# సత్యవాక్కు

క్రైస్తవ మాస పత్రిక

THE WORD OF TRUTH

సత్యవాక్కు

# రేడియో శ్రీలంకద్వారా క్రీస్తు సంఘముల
# కార్యక్రమములు

| | | |
|---|---|---|
| తెలుగు | : | సత్యవాణి (The Voice of Truth)<br>ప్రతి ఆది, మంగళ, గురు, శుక్ర, శనివారాల్లో<br>మధ్యాహ్నం 1-45 గంటలకు. |
| తమిళం | : | సత్యవాళి (The Way of Truth)<br>మంగళవారం - 5-30 p.m.<br>గురువారం, ఆదివారం } - 6-45 p.m. |
| మలయాళం | : | The Voice of Truth<br>మంగళ, శుక్రవారాలు 3-45 p.m. |
| కన్నడ | : | The Voice of Truth<br>ఆదివారం - 1-45 p.m. |
| హిందీ | : | సత్యసుసమాచార్<br>మంగళ, గురు, శుక్రవారాలు 9-00 p.m.<br>ఆదివారం - 12-45 to 1-00 p.m. |
| ఇంగ్లీషు | : | The Voice of Truth<br>సోమవారం - 9-00 p.m.<br>శుక్రవారం - 7-45 p.m. |

ఈ కార్యక్రమాలను అందరు వినండి. అందరికీ విన్పించండి.

Razan Electric Press, Kakinada-1.

# సత్యవాక్కు

**THE WORD OF TRUTH**

P.O. Box 80, KAKINADA, A.P. 533 001

**Editor :** J.C. CHOATE

**Managing Editor :** JOSHUA GOOTAM

**Pleading for Restoration of First Century Christianity**

సంపుటి **10** | జనవరి **1990** | సంచిక **6**


## సంపాదకీయము

### పెరిగే సమయము

### ( Time to Grow up )

క్రీ॥ శ॥ 33వ సంవత్సరంలో, ఇంచుమించు రెండు వేల సంవత్సరముల క్రితం ప్రభువు సంఘము యెరూషలేములో ఆరంభమాయెను (అపొ. కా. 2). యూదయ, సమరయలోను, భూదిగంతముల వరకును సువార్త ప్రకటింపబడుటవలన సంఘము ప్రపంచ మంతటా వ్యాప్తి చెందినది.

ఆ రోజుల్లో అపొ. తోమా భారతదేశానికి వచ్చి సువార్త ప్రకటించినట్లు చరిత్రాధారములు గలవు. తద్వారా క్రీస్తు సంఘము ఈ దేశంలో స్థాపించబడెను. ఆనాడు ఆరంభమైనది నేటివరకును కొనసాగించబడుచున్నదని చెప్పబడుచూ యుంటాది. అయితే మనం క్రొత్తనిబంధనలో చదువు సంఘానికి దానికి పోలికలు ఎప్పుడో మారిపోయాయి.

18వ శతాబ్దపు ఆఖరి భాగంలోను, 19వ శతాబ్దపు ఆరంభములోను అమెరికా క్రీస్తు సంఘములనుండి ఈ దేశానికి మిషనరీలు వచ్చారు. వారి కృషివలన కొన్ని స్థానిక సంఘములు ఆరంభమైనాయి, కొందరు స్థానికులకు ఆర్థిక సహాయం అందజేయబడింది. అయితే మిషనరీలు స్వదేశానికి వెళ్లిపోవుట వలనను, విదేశీ సహాయం కృశించుట వలనను కాలము గడచిన కొలది వారు ప్రారంభించిన పని కుంటుబడింది.

1950-60 సంవత్సరములలో షిల్లాంగు పట్టణములో కొందరు డినామినేషన్ ప్రజలు, లేఖనములలో చెప్పబడినట్లు క్రీస్తు సంఘముగాను, క్రొత్తనిబంధన క్రైస్తవులుగాను యుండుటకు నిశ్చయించుకొనిరి. ప్రపంచ మంతటిలోను ఆపని చేయుచున్నది వారొక్కరే యని వారనుకొన్నారు. అయితే వారిలాంటి ప్రజలే అమెరికాలోను, ఇతర దేశాలలోను యున్నట్లు కొంత కాలానికి వారు తెలుసుకొన్నారు.

షిల్లాంగులో యున్న భారతీయ క్రీస్తు సంఘములతో కలసి పని చేయడానికి కొందరు కెనడాదేశ సహోదరులు వచ్చియుండిరి, తరువాత వారిలో కొందరు మద్రాసుకు వెళ్ళిరి. తరువాత ఇంకా కొందరు కెనడానుండి, అమెరికానుండి వచ్చుచు వెళ్ళుచు యుండిరి. తద్వారా దేవుని వాక్యము ఈ దేశమంతట వ్యాపించినది. అనేకులు క్రీస్తువైపు మార్చబడ్డారు. ఇప్పుడు భారతదేశంలో క్రీస్తుసంఘాలు అనేక పట్టణములలోను, పల్లెలలోను యున్నవి.

మన దేశంలో ఈ మధ్య పునరుద్ధరింపబడిన కృషి 25 సంవత్సరములైనది. ఇది అంత ఎక్కువ సమయం కాకపోయినను, అనేకులు సువార్తను విని దానికి లోబడడం జరిగింది. ఇంతమంది సభ్యులు, సంఘాలు, బోధకులు ఇప్పుడు భారతదేశంలో యున్నందున, భారతదేశపు క్రీస్తు సంఘము పెరిగి తన వయసును బట్టి ప్రవర్తింపవలసినదై

యున్నది. సభ్యులు కానుకలు ఎక్కువ ఇయ్యాలి. స్థానిక సంఘాలు తమ బోధకులను సపోర్టు చేయాలి. ఈ పని జరిగేవరకు మన సంఘాలు అభివృద్ధిజెందవు.

బోధకులు తమ కొరకు తామే గాక ప్రభువుకు ప్రతిష్టించు కొనాలి. ప్రభువుకు జీతగాళ్ళుగాక సేవకులు కావాలి. సువార్తను తమ ప్రజలకు అందియ్యడానికి ఆసక్తి గలవారు ప్రభువుకు కావాలి. మనం సహా బోధకులతో పోటీపడుట కాదు గాని వారితో కలసి పని చేయాలి. మన ఇరుగుపొరుగు దేశాల సంగతి యేమి? వారికి కూడ సువార్త అవసరం. మేము పేదవారము వారికెట్లు సువార్త అందియ్య గలమని చాలమంది అంటారు. అయినను అట్టివారు ఈ లోక సంబంధ మైన అనేక విలాసాలను అనుభవిస్తూ దేవుని పనికి ధనం లేదనడం ఏమంత మంచిది కాదు.

ఒకడు పుట్టగానే పెద్దవాడై పోడు, నిజమే. క్రైస్తవులుకూడ అట్లే. అయితే పసిపిల్లలు నిత్యము పసిపిల్లలుగా యుండరు, క్రైస్త వులు కూడ అట్లుండరాదు.

గత కొద్ది సంవత్సరాలలో ఎంతో అభివృద్ధి సాధించాము. అయితే ఆత్మీయాభివృద్ధి, పెరుగుదల విషయంలో ఇంకా ఎక్కువ సాధిం చాలి. మన పని ఇంత ముందుకు వచ్చినను, మనం వెళ్ళవలసినది ఇంకా ఎంతో యున్నది. ఈ దేశంలో యున్న ప్రజలందరు సువార్త విన వలసి యున్నది.

రేడియోద్వారాను, సాహిత్యముద్వారాను గొప్ప పని జరుగు చున్నది. సువార్త కూటములలో అనేకులు క్రీస్తునైపు మరలు చున్నారు. అయితే స్థానిక సంఘాలు, సభ్యులు చేయూత నీయాలి. ఇది మన పని గాని వేరొకరిది కాదు. దేవునికి పని చేస్తూ పరిచర్య చేయుట వలన ప్రభువు నిన్ను దీవిస్తాడు.

ఇంకో ఇరవై అయిదు సంవత్సరముల తరువాత భారతదేశపు క్రీస్తుసంఘం ఎట్లుంటాది? అదంతా నీవెట్లు బోధిస్తావో దానిపై ఆధారపడియుంటాది. ప్రభువు చేయగలిగింది చేసారు, ఇతరులు వచ్చి సహాయపడ్డారు. ఇక పైన బాధ్యత మనదే.

---

పది ఆజ్ఞలు :

## దొంగిల కూడదు

## ( Thou Shall Not Steal )

దేవుడు మోషే ద్వారా ఇశ్రాయేలీయుల కిచ్చిన పది ఆజ్ఞలలో మొదటి ఏడు ఆజ్ఞలను గూర్చి ఇదివరకే గమనించి యున్నాము. ఈ రోజు ఎనిమిదవ ఆజ్ఞను ధ్యానిద్దాం. నిర్గమ 20:15లో "దొంగిల కూడదు" అని దేవుడు ఆజ్ఞాపించాడు. దేవుడు ఈ యాజ్ఞ ఇచ్చిన నాటినుండి నేటివరకు మానవు డేర్పరచుకొనిన చట్టాలన్నిటి లోను ఈ యాజ్ఞ ఇమడ్చబడియుండుట మనము చూడగలము. ఏల యనగా తనకు చెందని దేదైనను మానవుడు దొంగిలించుట సాంఘికం గాను నైతికంగాను దోషమే. దొంగిల కూడదు అని దేవుడిచ్చిన ఆజ్ఞ నిర్దోషిని రక్షించి దొంగను ఖండించుచున్నది.

దొంగతనము చేయువాడు దేనినైనా దొంగిలిస్తాడు - పరుల డబ్బు నుండి వస్తువులవరకు, ఆస్థిని, గృహాన్ని, పశువులను దొంగి లిస్తాడు. చిన్న చిన్న వస్తువులనుండి పెద్ద పెద్ద దొంగతనాలు చేసే వారున్నారు. ఈ మధ్య మన దేశంలో బేంకులలో దొంగతనాలు, దోపిడీలు ఎక్కువ జరుగుచున్నాయి. ఎక్కడ జరిగినా, ఎట్లు జరిగినా ఎంత జరిగినా దొంగతనం తప్పు, ఏలయనగా దొంగిల కూడదని దేవుడిచ్చిన ఆజ్ఞను మానవుడు అతిక్రమించి నీతిమంతుడుగా తీర్చ బడలేదు.

# అంతా దేవునిదే

ఈ లోకంలో ఉన్నదంతా దేవునిదేనని మనం మొదట తెలిసి కోవాలి. ఆదియందు దేవుడు భూమ్యాకాశములను సృజించాడు (ఆది 1 : 1). ఆయన సమస్తాన్ని సృజించాడు గనుక సమస్తము ఆయనవే. "సమస్త భూమియు నాదేగదా" యని నిర్గమ 19 : 5 లో ఆయన చెప్పాడు. "భూమియు దాని సంపూర్ణతయు, లోకమును దాని నివాసులును యెహోవావే" యని దేవుని వాక్యము చెప్పుచున్నది (కీర్త 24 : 1). "అడవి మృగము లన్నియు వేయి కొండలమీది పశువు లన్నియు నావే గదా. కొండలలోని పక్షులన్నిటిని నేనెరుగుదును. పొలములలోని పశ్వాదులు నా వశమై యున్నవి. లోకమును, దాని పరిపూర్ణతయు నావే" యని కీర్తన 50 : 10-11లో దేవుడు చెప్పు చున్నాడు. "వెండి నాది, బంగారు నాది; ఇదే సైన్యములకు అధిపతియగు యెహోవా వాక్కు" యని హగ్గయి 2 : 8లో వ్రాయబడి యున్నది.

భూమియు దాని సంపూర్ణతయు యెహోవాయే అయినను, మానవుడు ఆస్థిని, సంపాద్యమును కలిగియుండుట తప్పుకాదు. ఏల యనగా దేవుడే వాటిని మానవుని కిచ్చాడు. మొదట స్త్రీ పురుషులను చేసి "దేవుడు వారిని ఆశీర్వదించెను; ఎట్లనగా-మీరు ఫలించి అభివృద్ధి పొంది విస్తరించి భూమిని నిండించి దానిని లోబరచుకొనుడి; సము ద్రపు చేపలను, ఆకాశ పక్షులను, భూమిమీద ప్రాకు ప్రతి జీవిని ఏలుడని దేవుడు వారితో చెప్పెను. దేవుడు - ఇదిగో భూమిమీద నున్న విత్తనము లిచ్చు ప్రతి చెట్టును విత్తనమిచ్చు వృక్ష ఫలము గల ప్రతి వృక్షమును మీకిచ్చి యున్నాను" అని చెప్పాడు (ఆది 1 : 28, 29). అయితే మానవుడు పాపము చేసిన తరువాత వీటిని పొందు నిమిత్తము అతడు మరింత కష్టపడి పనిచేయవలసి వచ్చినది.

## కష్టపడి పనిచేయాలి

"ఆయన ఆదాముతో - నీవు నీ భార్య మాట విని తినవద్దని

నేను నీ కాజ్ఞాపించిన వృక్ష ఫలములు తింటివి గనుక నీ నిమిత్తము నేల శపింపబడి యున్నది; ప్రయాసతోనే నీవు బ్రతుకు దినము లన్నియు దాని పంట తిందువు ..నీవు నేలకు తిరిగి చేరునరకు నీ ముఖపు చెమట కార్చి ఆహారము తిందువు" అని చెప్పాడు (ఆది 3:17-19).

మానవుడు కష్టపడి చెమటోడ్చి సంపాదించిన దానిని ఇంకొకడు ఏ రకమైన ప్రయాస లేకుండ దొంగిలుట పాపము. అందు వలన దొంగిలకూడదు అని దేవుడు ఆజ్ఞాపించాడు.

దొంగిలకూడదు అనే ఆజ్ఞ పాతనిబంధన కాలములో ఇవ్వబడినను, అది క్రొత్త నిబంధనలో కూడ ఇవ్వబడి యున్నది. గనుక అది మనకును వర్తిస్తాది.

దొంగతనమునుగూర్చి క్రొత్తనిబంధన ఏమి చెప్పుచున్నదో ఇప్పుడు చూద్దాం. "ఎదుటి వానికి బోధించు నీవు నీకు నీవే బోధించు కొనవా? దొంగిలవద్దని ప్రకటించు నీవు దొంగిలెదవా?" యని అపొ. పౌలు రోమా 2:21లో ప్రశ్నించాడు. ఎఫెసీ 4:27, 28లో "అపవాదికి చోటియ్యకుడి. దొంగిలువాడు ఇక మీదట దొంగిలక అక్కరగల వానికి పంచిపెట్టుటకు వీలు కలుగు నిమిత్తము తన చేతులతో మంచి పని చేయుచు కష్టపడవలెను" అని చెప్పాడు. "దొంగ, దొంగతనమును హత్యను నాశనము చేయుటకు వచ్చును గాని మరి దేనికిని రాడు" అని యేసుప్రభువు చెప్పాడు (యోహాను 10 : 10).

ఈ వచనములను బట్టి దొంగతనాన్ని యేసుప్రభువు, ఆయన అపొస్తలులు ఖండించుచున్నట్లు మనము చూడగలము. మరల "దొంగలైనను, లోభులైనను, త్రాగుబోతులైనను, దూషకులైనను, దోచుకొనువారైనను దేవుని రాజ్యమునకు వారసులు కానేరరు" అని అపొ. పౌలు 1 కొరింథి 6 : 10లో చెప్పాడు. "దురాలోచనలు,

నరహత్యలు, వ్యభిచారములు, దొంగతనములు, అబద్ధ సాక్ష్యములు, దేవదూషణలు హృదయములో నుండియే వచ్చునని" యేసుప్రభువు బోధించాడు. క్రైస్తవుడైనవాడు దొంగగా గాని, నరహంతకుడుగా గాని చెడ్డపేరు తెచ్చుకోకూడదని అపొ. పేతురు బోధించాడు (1 పేతురు 4 : 15). దొంగిలుట దేవునికి, సాటి మానవునికి వ్యతిరేకముగా చేసే పాపము. అందుకే దొంగిలకూడదు అని దేవుడు ఆజ్ఞాపించాడు. "కీడుకు ప్రతి కీడెవనికిని చేయవద్దు; మనుష్యులందరి దృష్టికి యోగ్యమైన వాటిని గూర్చి ఆలోచన కలిగి యుండుడి" యని క్రొత్త నిబంధనలో పరిశుద్ధాత్ముడు హెచ్చరించుచున్నాడు (రోమా 12:17).

## బాధపడే దెవ్వరు

దొంగిలుట వలన బాధపడేదెవ్వరు? దొంగిలింపబడినవాడు ముందుగా బాధపడతాడు. అతడు తన డబ్బును, సొమ్మును, లేక ఆస్తిని కోల్పోయి బాధపడతాడు. అతని బాధ తాత్కాలికమే. దొంగ అయితే ప్రస్తుతానికి సంతోషించినను, అతడు నిత్యత్వములో బాధ పడతాడు. దేవుని రాజ్యంలో అట్టివానికి ప్రవేశము లేదు. దొంగిలుట వలన దేవుడు కూడ బాధపడతాడు.

మలాకీ 3 : 8, 9 లో ఆయన ఇట్లు హెచ్చరించుచున్నాడు: "మానవుడు దేవునియొద్ద దొంగిలునా? అయితే మీరు నాయొద్ద దొంగిలితిరి. దేని విషయములో మేము నీయొద్ద దొంగిలితిమని మీరందురు. పదియవ భాగమును ప్రతిష్ఠితార్పణలను ఇయ్యక దొంగిలితిరి. ఈ జనులందరును నా యొద్ద దొంగిలుచునే యున్నారు, మీరు శాపగ్రస్తులై యున్నారు. నా మందిరములో ఆహారముండునట్లు పదియవ భాగమంతయు మీరు నా మందిరపు నిధిలోనికి తీసికొనిరండి; దీని చేసి మీరు నన్ను శోధించిన యెడల నేను ఆకాశపు వాకిండ్లను విప్పి పట్టజాలనంత విస్తారముగ దీవెనలు కుమ్మరించెదనని సైన్యములకు అధిపతియగు యెహోవా సెలవిచ్చుచున్నాడు."

పాతనిబంధన కాలములో దేవుడు దశమభాగమును కానుకగా తన ప్రజలనుండి కోరాడు. వారు తమ ఆదాయములో పదియవ వంతు దేవుని కియ్యనందున దేవునియొద్ద దొంగిలుచున్నారని ఆయన చెప్పాడు. క్రొత్తనిబంధనలో మనము వర్ధిల్లినకొలది దేవునికి కానుక లియ్యాలని చెప్పబడింది. పాతనిబంధన కంటె శ్రేష్టమైన నిబంధనలో మనమున్నాము గనుక దశమ భాగముకంటె ఎక్కువగ మనము దేవుని కియ్య బాధ్యులమై యున్నాము. దేవుడు కోరు రీతిగా మనమాయ నకు ఇయ్యని యెడల ఆయన యొద్ద దొంగిలుచున్నవార మగుదుము. దేవునికి మనము కానుకల నిచ్చే నిష్పత్తి చొప్పున దేవునినుండి మనము పొందే దీవెనలుండును. "కొంచెముగా విత్తువాడు కొంచె ముగా పంట కోయును; సమృద్ధిగా విత్తువాడు సమృద్ధిగా పంట కోయును అని ఈ విషయమై చెప్పవచ్చును. సణుగుకొనకయు బల వంతముగా కాకయు ప్రతివాడు తన హృదయములో నిశ్చయించు కొనిన ప్రకారము ఇయ్యవలెను; దేవుడు ఉత్సాహముగా ఇచ్చు వానిని ప్రేమించును" అని పరిశుద్ధాత్ముడు చెప్పుచున్నాడు (2 కొరింధి 9 : 6-7) (1 కొరింధి 16 : 1, 2ను కూడ చూడండి).

దొంగల భయము లేకుండా యుండాలంటే, "పరలోకమందు మీ కొరకు ధనము కూర్చుకొనుడి; అచ్చట చిమ్మెట యైనను తుప్పైనను దాని తినివేయదు, దొంగలు కన్నము వేసి దొంగిలరు" అని యేసుప్రభువు బోధించాడు (మత్తయి 6 : 19, 20). నీవెక్కడ ధనాన్ని కూర్చుకొంటున్నావు ?

— బాషువా గూటం.

# చీకటిలో నడుచుట

## (Walking in Darkness)

గతంలో దేవుడేర్పరచుకొనిన ప్రజలు ఆయన దృష్టికి దుర్మార్గులయ్యారు. వారి అధోగతిని యెషయా ఇట్లు వర్ణించాడు: "రక్షింపనేరక యుండునట్లు యెహోవా హస్తము కురుచ కాలేదు. విననేరక యుండునట్లు ఆయన చెవులు మందము కాలేదు. మీ దోషములు మీకును మీ దేవునికిని అడ్డముగా వచ్చెను. మీ పాపములు ఆయన ముఖమును మీకు మరుగుపరచెను గనుక ఆయన ఆలకింపకున్నాడు" (యెషయా 59:1, 2). పాపభరితమైన వారి జీవితము వలనను, హృదయము వలనను వారు దేవుని చూడలేకపోయారు. "గోడకొరకు గుడ్డివారివలె తడవులాడుచున్నాము. కన్నులు లేనివారివలె తడవులాడుచున్నాము. సంధ్య చీకటియందు వలెనే మధ్యాహ్న కాలమున కాలు జారి పడుచున్నాము" (యెష 59:10).

నిజముగా దేవుని గ్రహించి చూచులాగున మన కన్నులు తెరచుదమా! ఆయన చిత్తమును గూర్చిన జ్ఞానముకై మనము హృదయమును తెరవాలి. దేవుని సేవించడానికి ఆసక్తి అవసరమే. అయితే వాక్య జ్ఞానములేని ఆసక్తి వ్యర్థము. కొందరు దేవుని యందు ఆసక్తి గలవారే. అయినను వారి ఆసక్తి జ్ఞానానుసారమైనది కాదు (రోమా 10:2). వాక్య జ్ఞానం లేకపోతే గుడ్డివాడు గోడకొరకు తడవులాడుచున్నట్లే యుంటాది. మనం ఎల్లప్పుడు దేవుని గూర్చియు ఆయన చిత్తమును గూర్చియు శ్రేష్టమైన జ్ఞానము కలిగియుండు నిమిత్తము ఆపేక్షించాలి.

దేవుని నిత్యసత్యములను ఆయన గ్రంథమును శ్రద్ధగా చదువుట ద్వారా గ్రహించుకోగలము. "దేవుని యెదుట యోగ్యునిగాను, సిగ్గుపడనక్కరలేని పనివాని గాను, సత్యవాక్యమును సరిగా ఉపదేశించు

వానిగాను నిన్ను నీవే దేవునికి కనుపరచుకొనుటకు జాగ్రత్తపడుము" (2 తిమో 2:15). "దైవజనుడు సన్నద్ధుడై ప్రతి సత్కార్యమునకు పూర్ణముగా సిద్ధపడియుండునట్లు దైవావేశము వలన కలిగిన ప్రతి లేఖనము ఉపదేశించుటకును, ఖండించుటకును, తప్పు దిద్దుటకును, నీతి యందు శిక్ష చేయుటకును ప్రయోజనకరమై యున్నది" (2 తిమోతి 3 : 16, 17).

బైబిలు పఠనమునకు లభించు తరుణములకొరకు మనము మెలకువగా యుండాలి. దానిని దినదినము ధ్యానిస్తూ యితరులతో కూడ పఠించుటకు అవకాశములను కల్పించుకోవాలి. బైబిలును ధ్యానిస్తూ, జీవిస్తూ, ఇతరులతో పంచుకొందము గాక.

—రానీ లోవే.

---

## క్రీస్తు శిష్యుడు
## (A Disciple of Christ)

నీవు యేసుక్రీస్తు శిష్యుడవా? శిష్యుడు వెంబడించేవాడు, నేర్చుకొనే వాడు, గురువును అంటియుండువాడు. వివిధ మతాల గురువులకు శిష్యులున్నారు. అయితే నీవు సజీవుడైన దేవుని కుమారుడగు క్రీస్తు శిష్యుడవా? లూకా సువార్త 14వ అధ్యాయములో ఆయన శిష్యుల నుండి యేసు ఏమి కోరుచున్నాడో ఆయన విపులముగా తెలియ జేయుచున్నాడు.

**యేసు సాటిలేని భక్తిని కోరుచున్నాడు :** "ఎవడైనను నా యొద్దకు వచ్చి తన తండ్రిని తల్లిని భార్యను పిల్లలను అన్నదమ్ములను అక్కచెల్లెండ్రను తన ప్రాణమును సహా ద్వేషింపకుంటే వాడు నా శిష్యుడు కానేరడు" (లూకా 14:26). ద్వేషించాలా? యేసు శిష్యులుగా యుండాలంటే నిజంగా మన కుటుంబాలను, మిత్రులను

ద్వేషించాలా? అట్లు కాదు. ఎందువలనంటే మన పొరుగువారిని, శత్రువులను కూడ మనం ప్రేమించాలని యేసు చెప్పాడు గదా. అయితే మనం ఆయనకంటే మరి దేనిని ఎక్కువ ప్రేమించరాదని ఆయన భావం. యేసుతో మనకున్న సంబంధానికి మధ్య ఇంకో సంబంధాన్ని ఇరికిస్తే అప్పుడు ఆయన శిష్యులము కానేరము. మనం నిరంతరము ఆయన రాజ్యాన్ని నీతిని వెదకాలి (మత్త 6:33).

**యేసు అంతులేని సమర్పణను కోరుచున్నాడు:** "మరియు ఎవడైనను తన సిలువను మోసికొని నన్ను వెంబడింపని యెడల వాడు నా శిష్యుడు కానేరడు" (లూకా 14:27). యేసును చంపడానికి ఆయన శత్రువులు సిలువ నుపయోగించారు. మన పాపముల ప్రాయశ్చిత్తార్థమై యేసు తన ప్రాణము బెడుతు ఆయన సిలువను సహించాడు. సిలువ మరణమునకు గుర్తు. మనం అహంభావానికి, పాపానికి మరణించాలి; క్రీస్తు కొరకు జీవించాలి. పౌలు ఇట్లనుచున్నాడు: "నేను క్రీస్తుతో కూడ సిలువ వేయబడియున్నాను; ఇకను జీవించువాడను నేను కాను; క్రీస్తే నాయందు జీవించుచున్నాడు" (గలతీ 2 : 20). మనము మరణము సంభవించినను, లేక మరణించు వరకును క్రీస్తు సిలువను మోయుచు యుండాలి (ప్రక 2:10).

లూకా 14 : 28-32 లో యేసుప్రభువు భవిష్యత్తును ఆలోచిస్తూ శిష్యత్వపు మూల్యమును యోచించాలని చెప్పాడు. మనలను ఆయన గోపురమును నిర్మించువానితోను, లేక యుద్ధమునకు పోవు రాజుతోను పోల్చుచున్నాడు. విధేయతను నిరుత్సాహ పర్చడానికి ఆయన ఈ సంగతులు చెప్పలేదు. సరిగదా ఆయనకు శిష్యులుగా యుండుటలో ఇమిడియున్న సంగతులను నిష్కపటముగా యోచించాలని ఆయన కోరుచున్నాడు. నమ్మకముగా యున్న శిష్యులకు ఆయన యిచ్చే దీవెనలను కూడ మనం గ్రహించాలని కోరుచున్నాడు.

అవి పాపములనుండి క్షమాపణ, జ్ఞానమునకు మించిన సమాధానము, నిత్యజీవము మొదలైనవి (అపొ. కా. 2:38; ఫిలిప్పీ 4:7-11; యోహా 14 : 1-3).

మనం సమస్తమును విసర్జించాలని యేసు కోరుచున్నాడు : "ఆ ప్రకారమే మీలో తనకు కలిగినదంతయు విడిచిపెట్టనివాడు, నా శిష్యుడు కానేరడు" (లూకా 14:33). నీకు కలిగినదంతయు అమ్మివేయాలని గాని, అందరకు పంచిపెట్టేయాలనిగాని ఈ వచనం చెప్పుటలేదు. అయితే నీకు కలిగిన యావత్తును విసర్జించాలని అది చెప్పుచున్నది. నీవు సువార్తకు లోబడినప్పుడు నీ జీవితాన్ని దానిలోని సమస్తమును క్రీస్తుకు అప్పగిస్తావు. నీవు క్రీస్తు శిష్యునిగా యుంటూ నీ ఆస్థిని, సంపదను, ప్రజలను స్వార్థపరునివలె కలిగి యుండలేవు. మనకు కలిగినదంతయు మన దేహములతో సహా దేవుని మహిమకొరకు వినియోగించాలి. కొరింధులోని క్రైస్తవులకు పౌలు ఇట్లు జ్ఞాపకం చేసాడు : "మీ దేహము దేవునివలన మీకు అనుగ్రహింపబడి, మీలోనున్న పరిశుద్ధాత్మకు ఆలయమై యున్నదని మీరెరుగరా ? మీరు మీ సొత్తుకారు, విలువ పెట్టి కొనబడినవారు గనుక మీ దేహముతో దేవుని మహిమపరచుడి" ( I కొరి 6 : 19-20).

యేసుప్రభువు తన శిష్యులందరి నుండి సాటిలేని భక్తిని, అంతులేని సమర్పణ జీవితమును, ఇహలోక సంగతుల విసర్జనను కోరుచున్నాడు. మరియు ఆయన శిష్యులు ఇతరులను కూడ శిష్యులుగా చేయాలని కోరుచున్నాడు. ఆయన ఇట్లనుచున్నాడు: "కాబట్టి మీరు వెళ్లి సమస్త జనులను శిష్యులనుగా చేయుడి; తండ్రి యొక్కయు, కుమారుని యొక్కయు, పరిశుద్ధాత్మ యొక్కయు నామములోనికి వారికి బాప్తిస్మమిచ్చుచు, నేను మీకు ఏయే సంగతులను ఆజ్ఞాపించితినో వాటినన్నిటిని గైకొనవలెనని వారికి బోధించుడి, ఇదిగో

నేను యుగ సమాప్తి వరకు సదాకాలము మీతో కూడ ఉన్నాను"
(మత్తయి 28 : 19-20). నీవు క్రీస్తు శిష్యుడవా?

— మార్క్ బైర్డ్.

---

## క్రీస్తు శిష్యుడగుట ఎట్లు ?

**( How to become a Disciple of Christ )**

1. క్రీస్తు సువార్త వినాలి : రోమా 10 : 14-17; అపొ. కా. 15:7; లూకా 8 : 12, 18.

2. దేవుని యందును, ఆయన కుమారుడైన క్రీస్తునందును విశ్వాస ముంచాలి : యోహాను 3 : 16; 8 : 24; అపొ. కా. 16 : 31-34; రోమా 10 : 9-10; హెబ్రీ 11 : 1, 6.

3. క్రీస్తు నందలి నీ విశ్వాసమును ఒప్పుకొనాలి : మత్తయి 10 : 32, 33; అపొ. కా. 8 : 37; రోమా 10 : 9-10.

4. పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందాలి : మార్కు 16 : 16; యోహాను 3 : 3-5; అపొ. కా. 2 : 38.

ఒకడు పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందగా, రక్షింపబడినవాడై దేవుని బిడ్డయగును, అతడు క్రీస్తు సంఘముతో ప్రభువుచే చేర్చబడును (అపొ. కా. 2 : 47), క్రీస్తు శిష్యుడు, క్రైస్తవుడగును (అపొ. కా. 11 : 26).

---

## విముక్తి

విముక్తి అనగా విడుదల యని అర్థము. పెట్టి చాకిరీ నుండి విముక్తి అన్న వార్తలు తరచూ వార్త పత్రికల్లో తారస పడుతూ

ఉంటాయి. అంతవరకూ జీవించడానికి వేరే ఆధారంలేక ఎదురు తిరిగే ధైర్యం లేక బానిస బ్రతుకు వెళ్ళదీస్తున్న అభాగ్యులు విముక్తి అయిన వెంటనే స్వేచ్ఛగా ఆనందంగా స్వతంత్ర జీవనం సాగిస్తూ ఉంటారు. సుమారు 2 వేల సంవత్సరముల క్రితం ఈ లోకములో నమ్మశక్యముగాని ఒక విచిత్రమైన సంఘటన జరిగియున్నది. అదే మనగా ఒక కన్యక కుమారుని ప్రసవించుట. ఆయనే యేసు క్రీస్తు.

యేసు అను శబ్దమునకు 'రక్షకుడు' అని అర్థము.

క్రీస్తు అను శబ్దమునకు 'అభిషిక్తుడు' అని అర్థము.

చరిత్ర పురుషులలో యేసు సాటిలేనివాడు. అద్వితీయుడు. ఎందుచేతనంటే తన ప్రజలను వారి పాపములనుండి ఆయనే రక్షించును (మత్తయి 1 : 21).

మొట్ట మొదటిగా దేవుడు ఇశ్రాయేలీయులను ఐగుప్తు బంధం నుండి విముక్తి చేసియున్నాడు.

1) నిర్గమ కాండము 15 : 13: "నీవు విమోచించిన యీ ప్రజలను నీ కృపచేత తోడుకొని పోతివి".

2) ద్వితీయోపదేశ కాండము 7 : 8: "అయితే యెహోవా మిమ్మును ప్రేమించువాడు గనుకను, తాను మీ తండ్రులకు చేసిన ప్రమాణమును నెరవేర్చువాడు గనుకను, యెహోవా బాహుబలము చేత మిమ్మును రప్పించి దాసుల గృహములో నుండియు ఐగుప్తు రాజైన ఫరో చేతిలో నుండియు మిమ్మును విడిపించెను".

3) ద్వితీయోపదేశ కాండము 24 : 18 : "నీవు ఐగుప్తులో దాసుడవై యుండగా నీ దేవుడైన యెహోవా నిన్ను అక్కడనుండి విమోచించెనని జ్ఞాపకము చేసుకొనవలెను".

మొట్టమొదట పుట్టిన వారిని విడిపించారు. నిర్గమ 13 : 13; 34 : 20; లూకా 2 : 22-24,

క్రీస్తు మానవుల నందరిని తన రక్తముచేత విముక్తి చేసి యున్నాడు. మానవుల కోసం తన ప్రాణమును బలిగా యిచ్చి యున్నారు.

మత్తయి 20 : 28; 1 తిమోతి 2 : 6; తీతు 2 : 14. ఆయనే మన విముక్తి, రక్షణ.

1 కొరింథి 1 : 30; రోమా 3 : 24: తద్వారా "నిశ్చయముగా అతడు మన రోగములను భరించెను, మన వ్యసనములను వహించెను. అయినను మొత్తబడిన వానిగాను దేవునివలన బాధింపబడిన వానిగాను శ్రమ నొందిన వానిగాను మన మతనిని ఎంచితిమి" (యెషయా 53:4) ఆయన తన రక్తముతో విముక్తి చేసెను. 1 పేతురు 1 : 18-19; 1 కొరింథి 7 : 23; ప్రకటన 1 : 5; ప్రకటన 5 : 9.

సంఘము ఆయన రక్తము చేతనే కొనబడింది. అపొ.కా 20:28; ప్రకటన 1 : 5-6;

పాతనిబంధన విశ్వాసులు కూడ క్రీస్తుచేత విముక్తి చెంది యున్నారు హెబ్రీ 9 : 15.

మనం కొన్నింటి నుండి విముక్తి చేయబడినాము.

1. పాతనిబంధన బంధంనుండి - గలతీ 4 : 5.

2. పాతనిబంధన శాపము నుండి - గలతీ 3 : 13.

3. పాపపు శక్తి నుండి - రోమా 6 : 18-22.

4. సమస్త దుష్టత్వం నుండి - తీతు 2 : 14.

5. ప్రస్తుత దుష్టకాలము నుండి - గలతీ 1 : 4.

6. పితృపారం పర్యాచారము నుండి - 1 పేతు 1:18.

విముక్తి లభించుటవలన ఈ క్రింది విషయాలలో సాధ్యమై యుంటిమి.

1. నీతిమంతులుగా తీర్చబడియున్నాము - రోమా3 : 24.

2. మన పాపములు క్షమింపబడినవి, ఎఫెసీ 1:7; కొలస్స 1:14.

3. పవిత్ర పరచబడియున్నాము - తీతు 2 : 14.

4. నిత్యరక్షణ స్వాస్థ్యమొంది - హెబ్రీ 9 : 12.

విముక్తి చేయబడిన వారెవరనగా

1. ఎవరైతే దేవునికి చెందుదురో - 1 కొరింథి 6:19-20.

2. ఎవరైతే మంచి కార్యములు చేయుటకు ఉత్సాహము చూపుతారో : తీతు 2:4. తద్వారా "పాపమునుండి విమోచింపబడి నీతికి దాసులైతిమి" (రోమా 6 : 18).

ప్రియ చదువరీ ! నీ పాపములనుండి విముక్తి పొందగోరు చున్నావా ?

"అరికాలు మొదలుకొని తలవరకు స్వస్థత కొంచెమైనను లేకున్నది, ఎక్కడ చూచినను గాయములు దెబ్బలు పచ్చి పుండ్లు అవి పిండబడలేకున్నను, కట్టబడ లేకున్నను తైలముతో మెత్తనచేయబడకున్నను (యెషయా 1:5-6). మీ పాపములు రక్తమువలె ఎఱ్ఱనివైనను అవి హిమమువలె తెల్లబడును, కెంపువలె ఎఱ్ఱనివైనను అవి గొఱ్ఱె బొచ్చువలె తెల్లనివగును" (యెషయా 1:18-19).

కావున, దేవుని వాక్యము వినుము. వినుటవలన విశ్వాసము కలుగును, విశ్వాసము వుంచిన తరువాత మారుమనస్సు పొందు. ఆపైన యేసుక్రీస్తు దేవుని కుమారుడని ఒప్పుకొనిన తరువాత బాప్తిస్మం పొందు. అప్పుడు నీ పాపములనుండి విముక్తి పొందెదవు. "నమ్మి బాప్తిస్మము పొందినవాడు రక్షించబడును. నమ్మనివానికి శిక్ష విధింపబడును" (మార్కు 16:16).

—ఇసుకపట్ల ఇజ్రాయెల్, కాకినాడ.

# రక్షించునట్టి విశ్వాసము

## ( The Faith that Saves )

దేవుని వెదకగోరు వారికి ఆవశ్యమైన విశ్వాసమును గూర్చి క్లుప్తముగా, హెబ్రీ గ్రంథమందు ఆ గ్రంథకర్త విశదీకరించినాడు. "విశ్వాసము లేకుండా దేవునికిష్టుడై యుండుట అసాధ్యము. దేవుని యొద్దకు వచ్చువాడు ఆయన యున్నాడనియు, తన్ను వెదకు వారికి ఫలము దయచేయువాడనియు నమ్మవలెనుకదా" (హెబ్రీ 11 : 6). మరియు "విశ్వాసమనునది నిరీక్షింపబడు వాటియొక్క నిజస్వరూపమును, అదృశ్యమైనవి యున్నవనుటకు రుజువునై యున్నది" (హెబ్రీ 11:1) పరలోకపు ఘనతయు, మహిమయును ఏ మానవుడు చూచి యుండలేదు. అయినను ఆయనయందు విశ్వసించి నిరీక్షణ కలిగి యుండుటద్వారా మరణానంతరం అట్టి మహిమాఘనతలు కల్గిన పట్టణమును స్వాస్థ్యముగా పొందుటకును, ఆనందించుటకును వరములను గ్రహింపబడి యున్నవని మనం బోధింపబడితిమి.

మనకైనందిన జీవితము లన్నియు ఒక విధమయిన విశ్వాసముమీద ఆధారములైనవికదా. ఉదాహరణకు : విత్తిన విత్తులు తగిన కాలమందు కోతకు వచ్చుననియు, పంటను కూర్చుకొందుననెడి నమ్మకము కల్గియే కదా విత్తువాడు విత్తులు విత్తును. అతని శ్రమ అంతయు అతివృష్టి వలనగాని అనావృష్టివలన గాని నాశనమగుననెడి విశ్వాసము రుజువుపర్చుకొనుటకు మాత్రం చేయడు. ఎందువలన అనగా శ్రమకు తగిన ఫలితం త్వరలో అతనికి లభ్యమగునని అనుభవం ద్వారా గుర్తెరిగినవాడై యున్నాడు. ఇందుమూలముగా ఒకడు దేవునియందు విశ్వాసముంచిన లేకున్నా అతను ఏదేని విషయమందు ఒక విధమయిన విశ్వాసము లేకుండా జీవించుట దుర్లభము అని తెలియుచున్నది.

గ్రీకు క్రొత్త నిబంధన యందు "విశ్వాసము" మరియు "నమ్మిక" అను రెండు పదములు ఒకే మూలమునుండి జనించినవి. అయినను మనము వీటిని వేర్వేరు అర్థములిచ్చి మన భాషయందు వాటిని ఉపయోగించుచున్నాము. కాని, క్రొత్త నిబంధన యందు ఈ రెండు పదములు ఒకే అర్థమును కల్గియున్నవి. ఈలాగున ఒకడు దేవునియందు నమ్మిక యుంచువాడు ఆయన యందు విశ్వసించును. ఆయనయందు విశ్వాసముంచువాడు ఆయనయందు నమ్మిక యుంచును. మరియు అపొస్తలుడైన పౌలు ఈ విధముగా చెప్పెను. "కాగా వినుటవలన విశ్వాసము కలుగును; వినుట క్రీస్తును గూర్చిన మాటవలన కలుగును" (రోమా 10:17). ఒకడు క్రీస్తు యేసునందలి విశ్వాసమును మొదట ఆయన వాక్యము వినుటద్వారా గాని, బైబిలు చదువుట ద్వారా గాని, ఇతరులద్వారాగాని వాక్యమందలి సత్యములతో సంబంధమును కల్గియుండుట ద్వారా కల్గియుండును.

## విశ్వాస పరిమాణములు

విశ్వాస పరిమాణములు అనేకములు. యేసు, ఆయన శిష్యులను గద్దించుచూ, "అల్ప విశ్వాసులారా" అనెను (మత్తయి 8 : 26). మరియొకసారి ఆయన కానాను స్త్రీని గూర్చి అధికార పూర్వకముగా ఈ విధముగా అనెను "...అమ్మా, నీ విశ్వాసము గొప్పది." (మత్తయి 15 : 28). దాసుని స్వస్థపరుచుమని అడిగిన శతాధిపతిని చూచి యేసు "...ఇశ్రాయేలులో నెవనికైనను నేనింత విశ్వాసమున్నట్టు చూడలేదని నిశ్చయముగా మీతో చెప్పుచున్నాననెను." (మత్తయి 8:10). కొండలను పెకలింపగల పరిపూర్ణ విశ్వాసమును గూర్చి పౌలు 1 కొరింథి 13 : 2లో వ్రాసెను. ఈ విధమయిన గొప్ప విశ్వాసము నేడు మనం కల్గియుండలేదు.

మన విశ్వాసము రక్షించునట్టి విశ్వాసమైయున్నదా అని

మనల్ని మనం ప్రశ్నించుకొనవలసిన వారమైయున్నాము. యేసు బయలు పర్చబడిన నాటినుండి రక్షణకొరకు క్రీస్తునందలి విశ్వాసము అవసరమైయున్నది. ఏలయనగా, "నమ్మని వానికి శిక్ష విధింపబడును" (మార్కు 16 : 16). యేసు బోధ విని దానియందు నమ్మిక యుంచిన వారు కొందరు గలరుగాని వారాయనను తిరస్కరించారు. "అయినను అధికారులలో కూడా అనేకులు ఆయన యందు విశ్వాసముంచిరి గాని, సమాజములో నుండి వెలివేయబడుదుమేమో యని పరిసయ్యులకు భయపడి వారు ఒప్పుకొనలేదు." (యోహాను 12 : 42). ఇప్పుడు యేసు ఈ విధముగా బోధించుచున్నాడు: "మనుష్యుల యెదుట నన్ను ఒప్పుకొను వాడెవడో పరలోకమందున్న నా తండ్రి యెదుట నేనును వానిని ఒప్పుకొందును. మనుష్యుల యెదుట ఎవడు నన్ను ఎరుగ ననునో వానిని పరలోకమందున్న నా తండ్రి యెదుట నేనును ఎరుగ నందుననెను" (మత్తయి 10 : 32, 33). యూదుల అధికారులను ఇష్ట పడువారు క్రీస్తు యందు విశ్వాసముంచియు ఆయనను ఒప్పుకొనక పోయిన యెడల వారికి ఆ కొలతప్రకారముగనే తీర్పు తీర్చబడును. అందువలన అటువంటి విశ్వాసము రక్షించలేదు.

## విశ్వాసము ద్వారా రక్షణ

సాతానుడు అతని సహచరులును కల్గియుండిన విశ్వాసము రక్షించదు కదా! ఎందువలన అనగా "దయ్యములును నమ్మి వణకు చున్నవి" అని యాకోబు 2 : 19లో చెప్పబడియున్నది. దయ్యములకు దేవుని యెడల ఉండిన నమ్మిక చొప్పున అవి రక్షణపొందునని కాని, వాటి విశ్వాసతలో ఏమి కొదువయైయున్నదో అని మనం అడుగ వచ్చును. దానికి సమాధానము విశ్వాసము, విధేయతయునై యున్నది. దయ్యముల విశ్వాసము కేవలం అస్వాభావికమయిన అంగీకారమై యున్నది. అవి క్రీస్తును నమ్ముచున్నవి కాని ఆయన యందు విశ్వ సించుటలేదు. ఆయన శక్తిని ఒప్పుకొనుచున్నవి కాని వాటి నమ్మిక

యందు విధేయతతో కూడిన విశ్వాసము లేదు. వాటి నమ్మిక మనసునకు కల్గినది మాత్రమే కాని హృదయములో ఆత్మ విషయమయిన విశ్వాసము లేదు. విధేయత కల్గిన విశ్వాసము రక్షించునట్టి విశ్వాసమైయున్నది.

అపొస్తులుడైన పౌలు రోమా 16 : 26లో నమ్మదగిన సత్యముగా "విధేయతతో కూడిన విశ్వాసమును" గూర్చి మాట్లాడాడు. విధేయత కొదువైన విశ్వాసము రక్షించ లేనటువంటిది. బైబిలునందలి హెబ్రీ గ్రంథము 11వ అధ్యాయములో పొందుపర్చిన విశ్వాసము ద్వారా సాధించిన విజయముల మాదిరులు మూలముగా ఆ అధ్యాయమును "విశ్వాసపు అధ్యాయము"గా మనం చెప్పుకొనవచ్చును. అందలి జనులు దేవుని ఆజ్ఞల యందు ఎల్లప్పుడు విధేయత కల్గిన విశ్వాసమును కనపర్చుట మనం గుర్తించగలము. ఎట్లనగా "హేబేలు అర్పణ ...", "నోవహు సిద్ధపాటు ...", మరియు "అబ్రాహాము విధేయత ...". ఈ మహా పురుషులు వారి విశ్వాసమును ప్రకటించుటకుగాను కొంత క్రియారూపమును వ్యక్తపర్చిరి. ఆ క్రియయే దైవసంబంధమైన ఆజ్ఞల యెడల కల్గిన విధేయతమైయున్నది. వారికి ఆజ్ఞాపింపబడినవి తిరిగి ప్రశ్నించక వారు జరిగించిరి. ఎదురు ప్రశ్నించక ఆయన ఆజ్ఞలను గైకొనువాడు విశ్వాస రక్షణ యందుండి ఆయనకు విధేయుడై యుండును.

## విశ్వాసముద్వారా వచ్చు వరములు

విధేయతతో కూడిన విశ్వాసమును కనపర్చుట ద్వారా మాత్రమే పాపక్షమాపణయు, నిత్యజీవము అను వరములు పొందుదుము అని మనం గ్రహించుదాం. ఈ సూత్రముపై ఆధారపడి బైబిలునందు అనేకములైన ఉదాహరణలు మనకు లభ్యమగును. సిరియా దేశపు సైన్యాధిపతి అయిన నయమాను (2 రాజులు 5).

అతని కుష్ఠరోగము నుండి బాగుపడు నిమిత్తము యొర్దాను నదికి పోయి ఏడు మారులు అందు మునిగి శుద్ధుడవు కమ్మని ప్రవక్తయైన ఎలీషా ద్వారా చెప్పబడినవాడై యుండెను. మొదటిగా, నయమాను ప్రవక్తయందు విశ్వాసముంచలేదు. చివరకు ప్రవక్త మాటలయందు విశ్వాసముంచి, దైవజనుని మాట చొప్పున యొర్దాను నదిలో ఏడు మారులు మునుగగా అతని దేహము పసిపిల్ల దేహమువలెనై శుద్ధుడాయెను. ఇక్కడ మనం గ్రహించవలసిన దేమనగా—నయమాను మనస్సు మార్చుకొని విశ్వసించిన తక్షణం దేవుడు, అతనిని శుద్ధుని చేయలేదు గాని విధేయతతో కూడిన విశ్వాసమును క్రియలద్వారా కనపర్చిన క్షణాన దేవుడు నయమానును శుద్ధుని చేసెను. నయమాను యొక్క రోగ శుద్ధత ముందు ఉండియుండలేదు గాని అది అతడు చూపిన విధేయత ద్వారా పొందియున్నాడు.

మానవుడు పాపమను ఆత్మీయ రోగముచేత బాధింపబడుచు నిత్యత్వమును పోగొట్టుకొనుచున్నాడు. ఆ రోగమును దేవుడు బాగుపరచును, పాపమునుండి మనల్ను రక్షించును, మనము ఆయనయందు విశ్వాసముంచినయెడల. కాని, మనము ఆయనయందు విశ్వాసము కల్గి ఆయన ఆజ్ఞలకు విధేయత చూపనంతవరకూ ఆయన మనల్ని క్షమించడు. యేసుక్రీస్తునందు విశ్వాసము కల్గిన తక్షణం మానవుడు రక్షణ పొందలేదు. ఆ విశ్వాసముద్వారా ఆయనకు విధేయత చూపినప్పుడుమాత్రం రక్షణ పొందగలడు, కాని అంతకుముందు మాత్రం కాదు. ఈ సత్యమును గ్రహించుటకు కొన్ని రుజువులు చదువుదము ; "యేసుక్రీస్తు నందు మీరందరు విశ్వాసమువలన దేవుని కుమారులైయున్నారు. క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిన మీరందరు క్రీస్తును ధరించుకొనియున్నారు." (గలతీ 3 : 26, 27). అపొస్తులుడైన పౌలు చూపున దేమనగా విశ్వాసము మనల్ను బాప్తిస్మము ద్వారా క్రీస్తుకు విధేయులగునట్లు చేయును. క్రీస్తులోనికి బాప్తిస్మము పొంది

నప్పుడు మాత్రం మనం విశ్వాసము ద్వారా రక్షణ పొందితిమని చెప్పగలము. ఈ వాక్యము యొక్క విపులీకరణ ఫిలిప్పయిలోనున్న చెరసాల నాయకుని యందు మనకు కన్పడును. "అయ్యలారా, రక్షణ పొందుటకు నేనేమి చేయవలెననెను." (అపొస్తలులు 16 : 30). "అందుకు వారు - ప్రభువైన యేసునందు విశ్వాసముంచుము అప్పుడు నీవును నీ యింటి వారును రక్షణ పొందుదురని చెప్పెను." (అపొ. 16 : 31). ఈ వాక్యము సందలి విశ్వాసము యేసు యెడల మనః పూర్వకమైన అంగీకారము మాత్రం కాక అంతకు మించిన సంబంధ మును క్రింది వాక్యములలో కనుగొనగలము. "రాత్రి ఆగడియ లోనే వారిని తీసుకొని వచ్చి, వారి గాయములను కడిగెను; వెంటనే అతడును అతని ఇంటివారును బాప్తిస్మము పొందిరి ... దేవునియందు విశ్వాసముంచిన వాడై తన ఇంటివారితో కూడా ఆనందించెను" (అపొ. 16 : 33, 34). తర్వాత అతని విశ్వాసము మారుమనస్సును కలుగచేసి (వారి గాయములు కడుగుట ద్వారా ఇది చూపబడింది) బాప్తిస్మము ద్వారా పూర్ణత నొందింది. చెరసాల నాయకుడు మారు మనసు పొంది యుండక పోతే విశ్వాసము ద్వారా అతనికి రక్షణ కలిగియుండక పోవును. మారుమనస్సు నొంది బాప్తిస్మము పొందుట ద్వారా అతడు చూపిన విశ్వాసము మూలముగా దేవుడు అతని పాపములు క్షమించెను.

---

## కాకినాడ స్కూల్ ఆఫ్ ప్రీచింగ్ బైబిల్ సెమినార్

కాకినాడ స్కూల్ ఆఫ్ ప్రీచింగ్ మూడవ బైబిల్ సెమినార్‌ను 1989 డిశంబరు 9 నుండి 15 వరకు కాకినాడ పట్టణములో స్థానిక దేవాలయం వీధిలో గల పైండా చలమయ్య కళ్యాణ మండప ప్రాంగణములో విజయవంతముగా నిర్వహించినది.

అనేక దేశములలో మహావక్తగా వన్నెకెక్కిన సహో॥ పెరి కోతమ్ ఈ సెమినార్ నందు ఉపన్యసించిరి. ఆయన వృద్ధులైనను రోజుకు మూడు పర్యాయములు గంభీరమైన వాక్యమును ఉత్సాహముగా బోధించిరి. ఈయన బోధలు వినుటకు ఆంధ్ర రాష్ట్రములోని అన్ని జిల్లాల వారే గాక ఇతర రాష్ట్రములగు ఒరిస్సా, పశ్చిమ బెంగాల్, మధ్యప్రదేశ్, బీహార్, పంజాబ్, కర్ణాటక, తమిళనాడు, మిజోరాం నుండి అనేక సోదర సోదరీలు తరలి వచ్చిరి. కోతమ్‌గారు ప్రతీ ప్రసంగమును చక్కని పటముల నుపయోగించి శ్రోతల హృదయములకు హత్తుకొనునట్లు బోధించిరి.

సహో. జె.సి. బెయిలీగారు, సహో. బిల్ పేక్స్టన్‌గారు రెండు దినములు ఈ సెమినార్ నందు పాల్గొని దేవుని వాక్యమును అందించిరి. సోదరులు హార్డిమన్ నికల్స్‌గారు కూడా ఈ సెమినార్ అన్ని దినముల యందు పాల్గొని చక్కని సందేశము లిచ్చుటతో బాటు శ్రోతలడిగిన అనేక బైబిలు ప్రశ్నలకు తగిన రీతిలో బైబిలునుండి జవాబులనిచ్చిరి.

ఈ సెమినార్‌కు రెండువేల మందికి పైగా హాజరయినారు. ప్రతీకూటమునకు హాలు అంతా జనముతో నిండిపోవుటయే గాక, అనేకులు బయట కూర్చుని వాక్యము వినెడివారు. ప్రతి కూటము క్రమముగాను, మర్యాదగాను, ప్రశాంత వాతావరణములో జరిగినది. బైబిలు సెమినార్ నిమిత్తము స్కూల్ ఆఫ్ ప్రీచింగ్ వారు తయారు చేసిన కీర్తనల పుస్తకము ఉపయోగించబడినది. ఈ కూటములందు పాల్గొనిన వారందరు తమ స్వరములనెత్తి ఉత్సాహముగా దేవునికి స్తుతి గానము చేయుట ఎంతో వినసొంపుగా నుండెను.

కూటములకు హాజరైనవారందరికి రుచిగల భోజనము మరియు వసతులు ఉచితముగానే ఏర్పాటు చేయబడినవి. కళ్యాణ మండప ఆవరణ యందుగల విశాలమైన గదులు, సాంబమూర్తి వీధిలో గల

బెయిలీ బిల్డింగు, బచ్చు రామేశం సత్రమందును మరియు కాకినాడ స్కూల్ ఆఫ్ ప్రీచింగ్ బిల్డింగు నందును వసతులు కల్పించబడినవి. గత సెమినార్ కంటె ఈ సెమినార్ నందు అధిక సంఖ్యలో జనులు పాల్గొని దీనిని దిగ్విజయము గావింప జేసిరి.

స్కూల్ ఆఫ్ ప్రీచింగ్ డైరెక్టర్ సహో. నెహెమ్యా గూటం గారు అన్ని ఏర్పాటులను స్వయముగా పర్యవేక్షించి ఎక్కడను కొరత లేకుండా సమస్తమును క్రమముగా జరిపించిరి. ఆయన కృషి ఫలితముగా అనేక మంది క్రైస్తవ సోదర, సోదరీలు చక్కటి ఆత్మీయ సహవాసమును పొందగలిగిరి. పలు ప్రాంతములనుండి పలు భాషలు మాట్లాడు వారనేకులు ఒండొరులు మిత్రులైరి.

డిశంబరు 15వ తేదీ శుక్రవారం మధ్యాహ్నంతో బైబిల్ సెమినార్ ముగించబడినది. ఈ సెమినార్ అన్నిరోజులలోను యేసు క్రీస్తును నమ్మి బాప్తిస్మము ద్వారా క్రీస్తుకు లోబడిన వారి సంఖ్య 155 మంది వరకు పెరిగెను. అందు మతశాఖలనుండి వచ్చిన వారనేకులు కలరు. సెమినార్ చివరి రోజున కోతమ్‌గారు కూటములకు హాజరైన ప్రతివారికి ఒక్కొక్క పరిశుద్ధ గ్రంథమును బహూకరించిరి.

## మద్రాస్‌లో బైబిల్ సెమినార్

కాకినాడ సెమినార్ అనంతరము మద్రాసు మహానగరము నందు రెండవ బైబిల్ సెమినార్ డిశంబరు 17వ తేదీనుండి 20వ తేదీ వరకు క్రిష్టియన్ చిల్డ్రన్స్ హోమ్ ఆవరణలో సహో. కె. మల్లిక్ గారి ఆధ్వర్యమున కాకినాడ స్కూల్ ఆఫ్ ప్రీచింగ్ సహాయ సహకారములతో దిగ్విజయముగా జరుపబడినది. సహో. నెహెమ్యా గూటంగారు ఈ సెమినార్ విజయమొందుటకు ఎన్నో సహకారముల నందించిరి. కాకినాడ స్కూల్ ఆఫ్ ప్రీచింగ్ టీచర్స్‌తో బాటు

విద్యార్థు లందరు యిందు పాల్గొని మద్రాసు సెమినార్‌కు ఒక ప్రత్యే
కతను కల్పించిరి.

ఈ సెమినార్ నందుకూడా సహో॥ పెర్రి కోతమ్‌గారు, హార్డిమన్ నికల్స్‌గారు గంభీరమైన వాక్యోపదేశము గావించిరి. కోతమ్‌గారు మద్రాస్‌లో గూడా పటముల నుపయోగించి అర్థమగు రీతిలో వాక్యమును బోధించిరి. యిందుకూడా నికల్స్‌గారు వాక్య పరిచర్య యందు ఉత్సాహముగా పాల్గొనుటయేగాక పలు ప్రశ్నలకు తగిన రీతిగా జవాబులనిచ్చిరి. మొత్తము 20 మంది వాక్యమునకు విధేయులై బాప్తిస్మము నొంది సంఘమునకు చేర్చబడిరి.

మద్రాసు నగర మంతటినుండి బోధకులు క్రైస్తవులు యించుమించు 250 మంది ఈ సెమినార్ నందు పాల్గొనిరి. ఈ కూటములకు హాజరైన వారందరికి భోజనము, వసతులు ఉచితముగా కల్పించబడెను. ప్రతి కూటము క్రమమగు రీతిలో చక్కని వాతావరణములో జరిగినది. సహో॥ మల్లిక్ కృషి ఎంతయో ఎన్నదగినది. వారికి కాకినాడ స్కూల్ ఆఫ్ ప్రీచింగ్ తరపున మా అభివందనములు.

కాకినాడలోను, ఆంధ్ర, తమిళనాడు రాష్ట్రము లందంతటను మరియు భారతదేశ మంతటిలోను క్రీస్తు సంఘము ఇంకా బలపడి ఆత్మీయముగా ముందుకు సాగుటకు యిట్టి సెమినార్‌లు అత్యవసరము. సెమినార్‌లలో పాల్గొనిన వారందరికి మా అభివందనములు.

కాకినాడ స్కూల్ ఆఫ్ ప్రీచింగ్,
కాకినాడ.

మీరు గమనించారా ?

"సత్యవాణి" రేడియో కార్యక్రమాలు

ఇప్పుడు ప్రతి ఆది, మంగళ,

గురు, శుక్ర, శని వారాలలో

మధ్యాహ్నం 1-45 గంటలకు

రేడియో శ్రీలంక ద్వారా వెలువడుచున్నవి.

Regd. No.

*From*

**SATYA WAKKU**

**P.O. Box. 80**

**KAKINADA-533 001**

No.

To

..............................

..............................

..............................

..............................